సాక్షి జగిత్యాల

శుక్రవారం । 3 । నవంబర్ । 2023

I



ఎవరైతే ధర్మాన్ని సరిగా నిర్వర్తిస్తారో.. వారే దేశాన్ని ఉద్ధరించగలరు.
– డాక్టర్ బీఆర్. అంబేద్కర్

మీకు తెలుసా...?

కాంగ్రెస్‌కు కాడెడ్లు.. కమ్యూనిస్టులకు 'హస్తం'



కరీంనగర్: హస్తం గుర్తును మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేటాయించారు. 1952లో కాంగ్రెస్ పార్టీ కాడెడ్ల గుర్తుపైనే పోటీ చేసింది. హైదరాబాద్ సంస్థానం మినహా దేశంలో కమ్యూనిస్టులు కంకి,కొడవలి గుర్తుపై పోటీ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం ఉండడంతో ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) పేరిట ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల సంఘం పీడీఎఫ్ అభ్యర్థులకు హస్తం గుర్తు కేటాయించింది. అప్పటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు చెయ్యి గుర్తు కేటాయించేది. 1957 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీలకు కంకి కొడవలి గుర్తు లభించింది. తరువాత సీపీఐ, సీపీఐ(ఎం)గా విడిపోవడంతో ఈసీ సీపీఐకి కంకి,కొడవలి, సీపీఐ(ఎం)కు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించింది. 1970లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలగా ఇందిరాగాంధీకి ఆవుదూడ గుర్తు రాగా , మరోసారి కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిన సమయంలో 1978లో ఇందిరాగాంధీ హస్తం గుర్తు స్వీకరించారు. ఇక అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీది చెయ్యి గుర్తుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు



స్వాగతం పలుకుతున్న కలెక్టర్

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు సంతోష్‌కుమార్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టరేట్ వద్ద కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవో నర్సింహమూర్తి స్వాగతం పలికారు. అనంతరం అధికారులందరూ కలిసి జిల్లాలోని వివిధ అంశాలపై చర్చించారు.

చక్కెర ఫ్యాక్టరీపై స్పష్టమైన హామీ ఇవ్వాలి



మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

ఇబ్రహీంపట్నం: ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీపై సీఎం కేసీఆర్ స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకుంటే రైతుల సత్తా చూపిస్తామని చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో చెరుకు రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు 15 ఏళ్లుగా షుగర్ ఫ్యాక్టరీ తెరిపించలేకపోయారని తెలిపారు. ఆయన వెంట గురిజెల రాజరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎలిసె పాపన్న, శేఖర్, గుజ్జుల నర్సారెడ్డి, అశోక్, జంగిలి నడ్పి నర్సయ్య, బద్దం శంకర్, నల్ల దేవన్న పాల్గొన్నారు.

సీఎం ప్రకటన చేయాలి

మెట్‌పల్లి:చక్కెర ఫ్యాక్టరీపై కోరుట్ల సభలో సీఎం కేసీఆర్ ప్రకటన చేయాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్‌పై ఉందన్నారు.

కళ్లముందే అభివృద్ధి

జంగ్ తెలంగాణ



ధర్మపురిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



ధర్మపురి సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

- ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి
- కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశమిచ్చినం
- రాష్ట్రంలో వచ్చేది బీఆర్‌ఎస్సే..
- కొప్పులను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ధర్మపురి ప్రజాఆశీర్వాద ప్రచార సభలో సీఎం కేసీఆర్

ధర్మపురి: 'అభివృద్ధి మీ కళ్లముందే కనిపిస్తోంది. ఓట్లు వచ్చాయంటే రాబందులు వాలుతాయి. ఆగం కావద్దు. ఆలోచించి ఓటు వేయాలి..' అని సీఎం కేసీఆర్ అన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్నారు. అధికారంలోకొచ్చాక విద్య, వైద్యం, తాగు, సాగునీరు, కరెంట్, రైతు సమస్యలు లేకుండా చేసుకున్నామని పేర్కొన్నారు.

కొప్పుల గాలి బాగుంది

ఎమ్మెల్యే, చీఫ్‌విప్, మంత్రిగా కొప్పుల ఈశ్వర్ ధర్మపురిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఇక్కడ ఆయన గాలి బాగుందని సీఎం అన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను 75వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. నృసింహస్వామికి రూ.వంద కోట్లు మంజూరు చేశామని, పనులు కొనసాగుతున్నాయని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్ ఏం చేసింది..?

యాభై ఏళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం అభివృద్ధి చేసిందో ప్రజలు గమనించాలని, సాగునీరు లేక భూములు బీళ్లుగా మారాయని సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకొచ్చాక 24గంటల కరెంట్, సాగునీటితో భూమలన్నీ సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే దళితబంధు

దళితబంధు ఇవ్వాలని ఎవరూ కోరకున్నా.. వారి కుటుంబాలు బాగుపడాలనే ఉద్దేశంతో దళితబంధును తెచ్చామని సీఎం కేసీఆర్ అన్నారు. తర్వాత బీసీబంధు, మైనార్టీబంధు ప్రారంభించుకున్నామని తెలిపారు. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే హుజూరాబాద్ తరహాలోనే ధర్మపురిలో ఒకేసారి అందరికి పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు.

ఈశ్వర్ పనిమంతుడు ఆశీర్వదించండి

గొల్లపల్లి: 'కొప్పుల ఈశ్వర్ పనిమంతుడు.. మెత్తటి మనిషి. నియోజకవర్గంలో టెయిలాండ్ కాలువలు ఉన్నాయి. రోళ్లవాగు ప్రాజెక్టు అని సతాయించి నా వెంటపడి పనులు చేయించుకున్నడు. ఇప్పుడు నియోజకవర్గంలో 1.30లక్షల ఎకరాలు సాగు అవుతోంది. ఆ తేడా.. అభివృద్ధిని గమనించాలి..' అని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో ఇక్కడి ఎమ్మెల్యేలు ఏ పనీ చేయలేదని, ఈశ్వర్ మాత్రం చెక్‌డ్యాంలు, మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయించాడని తెలిపారు. ఎన్నికలు రాగానే అందరూ వస్తారని, అభ్యర్థి గుణగణాలు, పార్టీల చరిత్ర, అభివృద్ధిని చూసి ఓటేయాలని సీఎం కోరారు.

ధర్మపురి రూపురేఖలు మారుస్తా: కొప్పుల



తల్లిదండ్రులు జన్మనిస్తే సీఎం కేసీఆర్ తనకు రాజకీయ భవిష్యత్‌ను ప్రసాదించారని, ఇది తనకు పునర్జన్మగా భావిస్తున్నానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతూ ఇప్పటికే కోట్లాది నిధులతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని వెల్లడించారు. అడిగిన ప్రతి పనినీ సీఎం కాదనలేదని, అభివృద్ధి సంక్షేమంలో ధర్మపురి ముందుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ బాదినేని రాజమణి, ఎంపీపీ బాదినేని రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్



- ఉదయం 11 గంటల నుంచే బీఆర్‌ఎస్ నాయకుల, కార్యకర్తలు, ప్రజలు వివిధ వాహనాల్లో ధర్మపురికి చేరుకున్నారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏపూరి సోమన్న, కళాబృందాలు ఆటపాటలతో అలరించారు.
- సాయంత్రం 4.40 గంటలకు సీఎం కేసీఆర్ హెలీకాప్టర్ ధర్మపురికి చేరుకుంది. 4.42 గంటలకు సీఎం సభాస్థలికి చేరుకున్నారు.
- 4.43 గంటలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.
- 4.44 గంటలకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- సుమారు 18 నిమిషాలపాటు సీఎం ప్రసంగించారు.
- 5.02 గంటలకు ప్రసంగాన్ని ముగించి హెలికాప్టర్‌లో బయల్దేరారు.

సీఎం సభకు సర్వం సిద్ధం

- నేడు సాయంత్రం 4 గంటలకు ప్రజా ఆశీర్వాద సభ
- కేసీఆర్‌కాలనీ వద్ద హెలిప్యాడ్
- పెద్ద ఎత్తున జనసమీకరణ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల, మంత్రి కొప్పుల



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: కోరుట్లలో శుక్రవారం నిర్వహించనున్న ప్రజాఆశీర్వాదయాత్ర బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం కేసీఆర్ హాజరయ్యే ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో భారీగా జనసమీకరణ చేస్తున్నారు. కోరుట్ల అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున బరిలో ఉన్న ఎమ్మెల్యే తనయుడు కల్వకుంట్ల సంజయ్ తరఫున నిర్వహించనున్న ఈ ప్రచార సభకు అసెంబ్లీ పరిధిలోని అన్ని మండలాల నుంచి ప్రజలు, కార్యకర్తలు సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సుమారు 70 వేల మందిని సభకు తరలించేలా పార్టీ నాయకులు చొరవ తీసుకుంటున్నారు. సీఎం సభ చుట్టూ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సభాస్థలికి వచ్చే వాహనాల కోసం కోరుట్ల వైపు ఒకటి, మెట్‌పల్లి వైపు మరో పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.

సీఎం సభ విజయవంతం చేయండి: కల్వకుంట్ల

సీఎం ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అభ్యర్థి సంజయ్ కోరారు. సభ ఏర్పాట్లను మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారని, ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు మరోసారి సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లా రైతు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, కోరుట్ల, మెట్‌పల్లి కౌన్సిలర్లు, కోరుట్ల సెగ్మెంట్‌లోని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కొండగట్టులో హనుమద్దీక్ష పీఠాధిపతుల పూజలు

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు అంజన్న స్వామిని గురువారం అఖిల భారత హనుమద్దీక్ష సేవా సమితి పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామిజీ దర్శించుకున్నారు. అర్చకులు హనుమాన్ మూల విరాట్‌తో ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే ఏడాది జనవరి 21న రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని లక్ష మందితో నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందుగా కొండగట్టు ఆలయంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, అర్చకులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట పీఠాధిపతులతో అర్చకులు, అధికారులు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు
- ఆన్‌లైన్ నామినేషన్లకు సువిధ యాప్



జగిత్యాలలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం, కోరుట్లలో ఆర్డీవో కార్యాలయం, ధర్మపురిలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి వారివారి నియోజకవర్గ కేంద్రాల్లో ఈనెల 3 నుంచి పదో తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణకు అవకాశం ఉంది.

విధివిధానాలు...

- పోటీచేసే ఒక్కో అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు వేయవచ్చు.
- నామినేషన్ పత్రాలు ఫారం–2లో సమర్పించాలి.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా తీసుకుని అందులోనే ఖర్చులు చూపాలి.
- రాష్ట్ర పరిధిలో ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలి.
- అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి.
- అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- కార్యాలయంలోకి నలుగురిని మాత్రమే గదిలోకి అనుమతిస్తారు.
- జనరల్ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5 వేలు దరావత్ చెల్లించాల్సి ఉంటుంది.

అందుబాటులో సువిధ యాప్

అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ వేసేలా ఎన్నికల కమిషన్ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సాధారణ నామినేషన్ల తరహాలోనే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలను r uvidha.eci.gov.i n యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అభ్యర్థుల వివరాలు, డిపాజిట్, ప్రతిపాదించే ఓటరు వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలను మూడుసెట్లు అందించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న నూతన్‌కుమార్, ఉదయ్‌కిరణ్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరేశ్ గురువారం తెలిపారు. 67వ ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన పోటీల్లో ఖోఖోలో నూతన్‌కుమార్, వాలీబాల్‌లో ఉదయ్‌కిరణ్ ప్రతిభ చాటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నరేశ్, పీఈటీ వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐకేపీ సీసీలపై ఫిర్యాదు



పీడీకి ఫిర్యాదు చేస్తున్న స్వరూప

జగిత్యాలరూరల్: వంజరిపల్లి గ్రామంలో ఐకేపీ స్త్రీనిధి రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులైన సీసీలపై చర్యలు తీసుకోవాలని వంజరిపల్లి గ్రామానికి చెందిన బెజ్జంకి స్వరూప గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామైక్య సంఘంలో జరిగిన స్త్రీనిధి అవకతవకల్లో అప్పటి సీసీలు విద్యాసాగర్, గంగారాం అక్రమాలకు పాల్పడ్డారని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ముగ్గురికి రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ గురువారం తీర్పు చెప్పారు. జగిత్యాల టౌన్ సీఐ నటేష్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శీలం సాయిరాజ్ అనే వ్యక్తిపై పాత కక్షలను మనసులో పెట్టుకొని డిసెంబర్ 6, 2015న అదే ప్రాంతానికి చెందిన తరాల బండి శ్రీనివాస్, పాలకుర్తి రాజు అలియాస్ డిబ్బి రాజు, ఇంద్రాల నరేష్ అనే ముగ్గురు వ్యక్తులు కట్టెతో దాడి చేశారు. సాయిరాజ్‌కు తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ రాజేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో.. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితులైన ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధించారు.

కేసీఆర్ సభతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- గులాబీమయమైన ధర్మపురి



సభకు హాజరైన జనం



కళాకారుల ఆటాపాట

గొల్లపల్లి: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ధర్మపురి పట్టణంలో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ వచ్చింది. ఈ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభ ప్రాంగణానికి భారీగా తరలివచ్చారు. దీంతో పట్టణంలో ఎటూ చూసినా గులాబీమయంగా మారింది. కేసీఆర్ ధర్మపురి సభకు సాయంత్రం 4.30 గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ఘన స్వాగతం పలికారు. సీఎం సభ స్థలికి 4.41కి చేరుకోవడంతో ఒక్కసారిగా సభ ప్రాంగణం అంతా హోరెత్తింది. నినాదాలు, ఈలలు, కేకలతో ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ జెండాలను పట్టుకొని కోలాటాలు, నృత్యాలతో హోరెత్తించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆశ్చర్యానికి గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి యువకులు పెద్దఎత్తున తరలివచ్చారు. మరికొందరు ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్లలో సభ స్థలికి చేరుకున్నారు. దాదాపు 50కి పైగా ఆర్టీసీ బస్సుల్లో సభ స్థలికి జనాలను తరలించారు. సభ విజయవంతానికి మంత్రి ఈశ్వర్ 10 రోజుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయపర్చడం వల్లే సభ విజయవంతమయిందని పలువురు చర్చించుకుంటున్నారు.

కళాకారుల ఆటపాటలతో..

పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏపూరి సోమన్నతో పాటు కళాకారులు చేపట్టిన ఆటపాట ఉత్సాహపరిచింది. యువకులు, మహిళలు, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ప్రజలు హాజరై కళాకారుల ఆటపాటలకు ముగ్ధులయ్యారు.

ట్రాఫిక్ అంతరాయం

జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఒకవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాలను తరలించడంలో ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్‌తో పాటు ఆలయానికి వెళ్లే దారులు, సభ చుట్టూ ఉండే దారుల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పట్టణ శివారులోనే వాహనాలు నిలిపేయడంతో ప్రధాన రహదారులన్నీ సభకు తరలించే గులాబీ శ్రేణులతో నిండిపోయాయి.

బందోబస్తు..

సభకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో బారికెడ్లు పెట్టి పెద్ద వాహనాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సభ గ్రౌండ్‌కు వచ్చే అన్ని రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భద్రతను సమీక్షించారు. ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 250 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించారు.

మంత్రి కృతజ్ఞతలు

సీఎం హాజరైన ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడంతో మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణంతో పాటు గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, బుగ్గారం, ఎండపల్లి, ధర్మారం మండలాల నుంచి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు రైతులు, ఆయా వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న కృష్ణమాదిగ

మెట్‌పల్లి: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కోరారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో గురువారం నిర్వహించిన మాదిగల విశ్వరూప సభలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగలు, ఉప కులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వర్గీకరణతోనే ఆ కులాలకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో 29సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తోందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్‌పల్లి లక్ష్మణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సభకు భారీగా తరలివచ్చిన జనం



ధర్మపురిలో సభకు తరలివస్తున్న జనం



ధర్మపురిలో స్టెప్పులేస్తున్న మహిళలు



ధర్మపురిలో ఏర్పాటు చేసిన బారీకేడ్లు

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు బహిరంగ సభకు జనం భారీగా తరలివచ్చారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచనల మేరకు మండల, గ్రామాల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి వేలాది మంది కార్యకర్తలు వచ్చారు. ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో మండలంలోని ప్రతి గ్రామం నుంచి గులాబీ కండువాలతో కనిపించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న కేసీఆర్ సభకు మధ్యాహ్నం 2 గంటల నుంచే ధర్మపురికి చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం సభకు మహిళలు, కార్యకర్తలు ఎండను సైతం లెక్క చేయకుండా వారికి ఏర్పాటు చేసిన కుర్చీల్లో ఆసీనులయ్యారు. ధర్మపురి పట్టణమంతా గులాబీ జనంతో నిండిపోయింది. బీఆర్ఎస్ నినాదాలతో దద్దరిల్లింది.

కేరింతలు.. స్టెప్పులు

సభా ప్రాంగణంలో కళాకారుడు ఎమ్మెల్సీ పాడిన తెలంగాణ పాటలకు మహిళలు, కార్యకర్తలు మైమరచిపోయారు. పాటలకు తగ్గట్టుకు కేరింతలు కొడుతూ స్టెప్పులేయడం ఆకట్టుకున్నాయి. కవరేజ్ కోసం వెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను లోపలికి అనుమతించకుండా పోలీసులు అత్యుత్సాహం చూపారు. రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి ఏ ఒక్కరిని లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో.. పోలీసులు, మీడియాకు మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో మీడియా ప్రతినిధులు నిరుత్సాహానికి గురయ్యారు.

నామినేషన్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుంచి అభ్యర్థులు వేసే నామినేషన్ల ప్రక్రియకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని, ఐదుగురు కంటే ఎక్కువ మందికి అనుమతి లేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు భారీకేడ్లు పెడతామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలని సూచించారు. ఎస్పీ వెంట టౌన్ సీఐ నటేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌వి ఫేక్ గ్యారంటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: కాంగ్రెస్ ఫేక్ గ్యారంటీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తోందని, కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు లైఫ్ గ్యారంటీ ఇస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 2018లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కరోనా వల్ల రెండు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డామని, కానీ చివరి రెండున్నరేళ్లలో జగిత్యాలలో రూ.1,200 కోట్ల నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి కుల సంఘం, ఆలయాలు, మహిళా సంఘాలకు నిధులు కేటాయించామని, కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందో చెప్పాలని అన్నారు. జగిత్యాలలో మెడికల్ కళాశాల, అమరవీరుల స్తూపం, గొల్లపల్లి రోడ్ విస్తరణ, అంతర్గత రోడ్లు ఇలా ఎన్నో అభివృద్ధి చేసుకో వడం జరిగిందని, వీటిని చేసుకునే క్రమంలో ప్రతిచోట జీవన్‌రెడ్డి అడ్డుపడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. ఇందిరమ్మకాలనీతో జీవన్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని, అదే స్థలంలో 4,520 డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి లబ్ధిదారులకు అందించామన్నారు. మాజీ మంత్రి రాజేశంగౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, గట్టు సతీశ్, అబ్దుల్ ఖాదీర్, సుధాకర్‌రావు, సంజీవరావు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

చెక్కు అందజేత

ఇప్పటికే జగిత్యాల అభివృద్ధి ఎంతో చేసుకోవడం జరిగిందని, మరోసారి అవకాశమిస్తే మరింత చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం 14వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిత్తారి లింగారెడ్డి ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ.50వేల చెక్కు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు సతీశ్, ఖాదిర్, సుధాకర్, సంజీవరావు, సతీశ్‌రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి

గతంలో చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. గురువారం పలు వార్డుల్లో ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాడి వాతావరణంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీలత

జగిత్యాలఅగ్రికల్చర్: పొడి వాతావరణం ఉంటే యాసంగిలో అధిక దిగుబడి వస్తుందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం అగ్రనామి ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీలత అన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం దత్తత గ్రామమైన రాయికల్ మండలం అల్లీపూర్‌లో యాసంగిలో సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు, సమయానుకూలంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. నువ్వుల పంటలోని రకాలు, విత్తనోత్పత్తిపై పద్మజ, ప్రధాన పంటల్లో చీడపీడల నివారణపై బలరాం, వరి పంటలో మేలు రకాలపై మధుకర్, పంటల మార్కెటింగ్‌పై ఆర్థిక శాస్త్రవేత్త రజనీదేవి, ఎరువుల యాజమాన్యంపై ఎస్.సాయినాథ్ వివరించారు. అనంతరం, జేజీఎల్–28639 వరి రకాన్ని సాగు చేస్తున్న అంజయ్య అనే రైతు పొలాన్ని శాస్త్రవేత్తలు, రైతులు సందర్శించారు. కార్యక్రమంలో అల్లీపూర్ రైతు సొసైటీ అధ్యక్షుడు అత్తినేని శంకర్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, రైతులు పాల్గొన్నారు.

రూ.19.02 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో పట్టణ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. వేణుగోపాల్ అనే వ్యక్తి వద్ద రూ.14.02 లక్షలు, శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ.5 లక్షలు పట్టుకున్నారు. నగదును గ్రీవెన్‌సెల్ కమిటీకి అప్పగించినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

విషం కలిపి కూల్‌డ్రింక్ తాగించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ ప్రాంతానికి చెందిన బోడ చంద్రకళ అనే మహిళకు బలవంతంగా కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించిన గోవర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. చంద్రకళ విద్యుత్ శాఖలో ఫిల్టర్ మెకానిక్ గ్రిడ్‌గా పని చేస్తుంది. అదే శాఖలో పని చేసే గోవర్ధన్ అక్టోబర్ 30న కూల్‌డ్రింక్ తీసుకొచ్చి చంద్రకళకు ఇవ్వగా.. ఆమె తాగేందుకు నిరాకరించింది. బలవంతం చేయడంతో ఆమె కూల్‌డ్రింక్ తాగగా.. అస్వస్థతకు గురైంది. ఫోన్లో భర్త బోడ మోహన్‌కు సమాచారమందించింది. మోహన్ కార్యాలయానికి వెళ్లి చంద్రకళను ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్యులు కూల్‌డ్రింక్‌లో విషం కలపడం వల్లే అస్వస్థతకు గురైందని వెల్లడించారు. మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జీవాలకు టీకాలు వేయించాలి



మేకకు టీకా వేస్తున్న వెటర్నరీ ఏడీ నరేశ్

జగిత్యాలఅగ్రికల్చర్: జీవాలకు తప్పనిసరిగా పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేష్ కోరారు. తాటిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్త జీవాల విసర్జితాల ద్వారా ఇతర జీవాలకు వ్యాప్తి చెందుతుందని చెప్పారు. జీవాల పాకలను శుభ్రంగా ఉంచడమే కాకుండా 3 నెలల వయస్సున్న గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించాలని సూచించారు. ఒక్కసారి టీకా వేస్తే మూడేళ్ల వరకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. పశు వైద్యులు డాక్టర్ నరేష్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది నాగేందర్, రాములు, అనిల్ పాల్గొన్నారు.

జిల్లాలో 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జగిత్యాలరూరల్:జిల్లాలో 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐకేపీ ఆధ్వర్యంలో 129 కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా 271 కేంద్రాల ద్వారా ధాన్యం కొంటామని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేంద్రాల ఇన్‌చార్జీల నుంచి టోకెన్లు తీసుకోవాలన్నారు. సమస్యలుంటే రైతులు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8187లో సంప్రదించాలని సూచించారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

- బీఆర్ఎస్ కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్

కోరుట్లరూరల్: కోరుట్ల ఎమ్మెల్యేగా తనకు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. చిన్నమెట్‌పల్లిలో పలువురు బీఆర్ఎస్ చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో తన తండ్రి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తొమ్మిదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేష్, నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే..



లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్తులు

వెల్గటూర్: తెలంగాణలో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం చెర్లపల్లి, కోడిపుంజులపల్లి గ్రామాల్లోని 100 మందికి పైగా గ్రామస్తులు, కార్యకర్తలు, మహిళలు, యువత వివిధ పార్టీల నుంచి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు తప్ప ఎవరికీ మేలు జరగలేదన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎండపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వెల్గటూర్, ధర్మపురి మండలాల యూత్ అధ్యక్షులు పూదరి రమేశ్, రాందేని మొగిళి, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి విజయ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, ఉప సర్పంచ్ సందీప్, తిమ్మాపూర్ సింగిల్‌విండో డైరెక్టర్ కోటయ్య, నాయకులు గెల్లు శ్రీనివాస్, రమేశ్, సంజీవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. కథలాపూర్‌కు చెందిన శేఖర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. మరో బైకుపై మెట్‌పల్లికి చెందిన రమేశ్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాడు. మెట్‌పల్లికి చెందిన రమేశ్‌తో పాటు అదే బైక్‌పై ఉన్న అనిత అనే మహిళకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం అంబులెన్స్‌లో కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కథలాపూర్‌కు చెందిన శేఖర్‌ను స్థానిక అమృత ఆసుపత్రిలో చేర్పించారు.